సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



సరిహద్దు గ్రామాల్లో విస్తృత తనిఖీలు
ఎన్నికలు సమీపిస్తుండడంతో సరిహద్దు గ్రామాల్లో ఆంధ్ర, కర్ణాటక పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీ ముమ్మరం చేశారు. 8లో



టమాట కిలో రూ.15
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 37.3°/16.2°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



పుట్టపర్తి టౌన్: పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ కోసం అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 23న పుట్టపర్తి డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులో వెళ్లే ప్రయాణికులు అరుణాచలం గిరి ప్రదక్షిణతో పాటు వేలూరు గోల్డెన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయాలను దర్శించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రత్యేక సర్వీసు 23వ తేదీ ఉదయం 9 గంటలకు పుట్టపర్తి నుంచి బయలుదేరుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా పుట్టపర్తి బస్టాండ్ కౌంటర్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 7382860486, 9959225857 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బైకుల దొంగలకు జైలు



అనంతపురం: ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో ఇద్దరికి చెరో ఏడాది జైలు శిక్ష విధిస్తూ అనంతపురం జేఎఫ్‌సీఎం స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ జే. సుజిన్ కుమార్ తీర్పు వెలువరించారు. వివరాలు.. అనంతపురంలోని ప్రియాంక నగర్‌కు చెందిన సద్దాం హుస్సేన్, గార్లదిన్నె మండలం పెనకచర్ల గ్రామానికి చెందిన రాజశేఖర్ బుక్కరాయసముద్రం మండల పరిధిలో గత ఏడాది ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడ్డారు. దీనిపై బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్‌ఐ పి. వెంకటేశ్వర్లు దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీటు దాఖలు చేశారు. మేజిస్ట్రేట్ జే. సుజిన్ కుమార్ విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా దర్యాప్తు అధికారి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఏపీపీ హేమలత, కోర్టు కానిస్టేబుల్ రమణను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

ఎన్నికల కసరత్తు ముమ్మరం

- బిజీబిజీగా అధికార యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- అవసరమైతే అదనంగా కేంద్రాలు
- ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా చర్యలు



కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుండగా.. ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. ఎన్నికలను అత్యంత పకడ్బందీగా నిర్వహించడంతో పాటు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడంలో తలమునకలవుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, ఫర్నీచర్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు సమకూర్చడంలో బిజీబిజీగా గడుపుతున్నారు.

3,774 పోలింగ్ స్టేషన్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 3,774 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. ఇందులో అనంతపురం జిల్లాలో 2,213, శ్రీ సత్యసాయి జిల్లాలో 1,561 ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలు ఉన్నాయా లేదా అధికారులు పరిశీలిస్తున్నారు. 95 శాతం కేంద్రాల్లో అన్ని వసతులు ఉన్నట్లు ఇప్పటికే గుర్తించారు. మిగిలిన వాటిల్లో వసతులు కల్పించాలని తహసీల్దార్లకు రెండు జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.

అవసరమైతే అదనపు పోలింగ్ స్టేషన్లు

ఏదైనా పోలింగ్ కేంద్రం పరిధిలో 1,500 ఓట్లకు మించి ఉంటే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. ఫారం 6, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. ఫారం 7 క్లెయిములపై విచారణ వారంలో పూర్తి చేయనున్నారు. ఒకవైపు ఏర్పాట్లు చేస్తూనే.. మరోవైపు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై విస్తృతంగా చైతన్యం కల్పిస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను పోలీసు అధికారుల ద్వారా సేకరిస్తున్నారు.

కలెక్టర్ నిత్యం సమీక్షలు..

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అనంతపురం కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు నిత్యం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. 100 శాతం ఓటింగ్ సాధనే లక్ష్యంగా దిశానిర్దేశం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలోనూ పర్యటిస్తూ సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే గుర్తించిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. కేంద్రాల్లో సౌకర్యాలు కల్పనకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ తాగునీరు, విద్యుత్ సదుపాయం ఉండేలా చూడాలన్నారు. అలాగే దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే కలెక్టరేట్ సమీపంలో మోడల పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓట్ల కౌంటింగ్ కేంద్రాల కోసం గుర్తించిన గోరంట్లలోని మాంటిస్సోరి పాఠశాల, లేపాక్షిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి సౌకర్యాలు, చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. సుమారు 11 వేల మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఇందులో కీలకమైన అధికారులతో ఇప్పటికే మూడుసార్లు సమీక్షలు నిర్వహించాం. వంద శాతం ఓటింగ్ జరిగేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. స్వీప్‌లో భాగంగా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. తుది ఓటరు జాబితా అనంతరం వచ్చిన క్లెయిమ్‌లను పరిశీలించి పరిష్కరిస్తాం.

– అరుణ్‌బాబు, కలెక్టర్

జిల్లా వివరాలిలా...	
మొత్తం ఓటర్లు	19,94,544
పోలింగ్ కేంద్రాలు	2,213
ఫర్నీచర్ సౌకర్యం ఉన్నవి	2,179
విద్యుత్తు సౌకర్యం	2,199
ర్యాంప్ సౌకర్యం	2,164
మరుగుదొడ్లు సౌకర్యం	2,184
తాగునీటి సౌకర్యం	2,186

శ్రీ సత్యసాయి జిల్లాలో	
మొత్తం ఓటర్లు	13,91,628
పోలింగ్ కేంద్రాలు	1,561
ఫర్నీచర్ సౌకర్యం ఉన్నవి	1,561
కరెంటు సౌకర్యం	1,561
ర్యాంప్ సౌకర్యం	1,560
మరుగుదొడ్ల సౌకర్యం	1,557

1.90 లక్షల మందికి పోలియో చుక్కలు



పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్షిస్తున్న డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి

ప్రశాంతి నిలయం: జిల్లాలో 0- 5 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పిల్లలు 1,90,655 మంది ఉన్నారని, వారందరికీ పోలియో చుక్కలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి ఆదేశించారు. మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. మంగళవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం డివిజన్ల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలియో చుక్కలు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వందశాతం పల్స్ పోలియోకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో నియమిస్తున్న బృందాలు..సిబ్బంది..పీపీఐ బూతులు గురించి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారులను ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య, డెమో బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి న్యాక్ కమిటీ పరిశీలన



జేఎన్‌టీయూ (ఏ) నూతన పాలకభవనం

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)కు గురువారం న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) పీర్ కమిటీ రానుంది. వర్సిటీకి గ్రేడింగ్ నిమిత్తం 3 రోజుల పాటు సందర్శించనుంది. జేఎన్‌టీయూ స్థాపించాక తొలిసారి న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్తుండడం గమనార్హం. పీర్ కమిటీలో సంగాణి, రాఘవ, జయంతి, సతీష్ పాల్, మంజునాథ సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు దక్కింది. ఈ క్రమంలోనే న్యాక్ మంచి గ్రేడింగ్ వచ్చేలా వర్సిటీ ఉన్నతాధికారులు కృషి చేశారు. న్యాక్ గుర్తింపు దక్కితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీల నుంచి గణనీయంగా నిధులు దక్కే అవకాశం ఉంటుంది. వర్సిటీ జారీ చేసే సర్టిఫికెట్‌కు మంచి గుర్తింపు లభిస్తుంది. కాగా, న్యాక్ పీర్ కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రమే జేఎన్‌టీయూ చేరుకుంటారని సమాచారం.

ఈసీ మార్గదర్శకాలన్నీ పాటించాలి

- ఎంసీసీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి
- ఎన్నికల అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలన్నీ పాటించి ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బృందం, వ్యయ పరిశీలన, అకౌంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ బృందాలకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల కమిషన్ విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. నియమనిబంధనలపై అవగాహన కల్పించారు. శిక్షణలో పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, మడకశిర, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల అధికారులు, పోలీస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి, మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నోడల్ ఆఫీసర్ పాత్ర చాలా ముఖ్యమని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో ఆయా శాసన సభ, పార్లమెంట్ నియోజక వర్గాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చుల వివరాలను నామినేషన్ రోజు నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ పరిశీలన బృందాలు నమోదు చేయాలన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం 30 రోజుల్లో ఖర్చుల వివరాలను అందజేయాలన్నారు.

సరిహద్దులో తనిఖీలు ముమ్మరం చేయాలి..

జిల్లా సరిహద్దులో తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డబ్బు, మద్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలను వీడియో సర్వేలెన్స్ టీంలు రికార్డు చేయాల్సి ఉంటుందన్నారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఇతర ప్రచార సామగ్రిని కూడా అభ్యర్థి ప్రచార ఖర్చులో చూపాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఇన్‌కం ట్యాక్స్, వాణిజ్య పన్నుల శాఖ వ్యయ పరిశీలన అంశంలో నమోదు చేస్తారన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం విధుల్లో ఎలాంటి అనుమానాలు వచ్చినా నోటిఫికేషన్‌కు ముందే నివృత్తి చేసుకోవాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, వెంకటశివరామిరెడ్డి, వంశీకృష్ణ, కమిషనర్లు వంశీ, రంగస్వామి, అంజయ్య, శ్రీకాంత్, కిరణ్‌కుమార్, ఇన్‌కంట్యాక్స్ అధికారులు విజయలక్ష్మి, ప్రణీత్, డీటీ మైనుద్దీన్, మాస్టర్ ట్రైనర్ నారాయణస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. టీడీపీ కుట్ర పోటు

- ధర్మవరం పట్టణంలోని వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏడుగురు స్థానికంగా నివాసం లేరంటూ అధికారులకు ఫారం-7 ద్వారా అభ్యంతరం అందింది. దీన్ని ధర్మవరం మండలం గొట్లూరుకు చెందిన తలారి నారాయణస్వామి సమర్పించినట్లు పేర్కొన్నారు. దీంతో ఎన్నికల అధికారులు దరఖాస్తుదారుడు తలారి నారాయణస్వామిని సంప్రదించేందుకు ప్రయత్నించగా, అతను ఓ కేసులో నిందితుడిగా ఉంటూ ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా సబ్‌జైల్‌లో ఉన్నట్లు తేలింది. నెల రోజులుగా రిమాండ్‌లో ఉంటున్న వ్యక్తి పేరుపై టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఓట్లు తొలగించాలని దరఖాస్తు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు విస్తుపోయారు.
- ధర్మవరం రాజేంద్రనగర్, కొత్తపేట, టీచర్స్ కాలనీల్లోని వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు, సాధారణ ప్రజల ఓట్లను టార్గెట్ చేస్తూ గుర్తు తెలియని వ్యక్తుల పేరుతో టీడీపీ నాయకులు ఫారం-7 కింద దరఖాస్తులు చేశారు. ఎన్నికల అధికారులు విచారణకు వెళ్లగా, దరఖాస్తుల్లో పేర్కొన్న వ్యక్తులు తాము దరఖాస్తు చేయలేదని సమాధానం ఇచ్చారు. దీంతో ఎన్నికల సిబ్బంది సైతం బోగస్ దరఖాస్తులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

...టీడీపీ నేతల ఓటు పోట్లకు పైరెండు ఉదాహరణలు మాత్రమే. ధర్మవరం నియోజకవర్గంలో ఇలా వేలాది మంది ఓట్లు తొలగించాలంటూ ఫారం-7 కింద దరఖాస్తులు అందాయి. దాదాపుగా అన్నీ బోగస్‌వే కావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- వైఎస్సార్ సీపీ మద్దతుదారులే లక్ష్యంగా 'తమ్ముళ్ల' పన్నాగం
- గుర్తు తెలియని వ్యక్తుల పేరుతో ఫారం-7 దరఖాస్తులు
- జైల్లో ఖైదీల పేరిట కూడా ఓట్లు తొలగించాలని క్లెయిమ్‌లు
- ఇప్పటికే వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఓట్లు గల్లంతు
- సత్వరం చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



ధర్మవరం: ఓటమి భయం పట్టుకున్న టీడీపీ నాయకులు దొడ్డిదారిన గెలిచేందుకు అడ్డమైన దారులన్నీ వెతుక్కుంటున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఓట్లు తొలగించేందుకు కుట్రలకు తెర లేపుతున్నారు. ఓట్ల రద్దుకు వేల సంఖ్యలో ఫారం-7 దరఖాస్తులు సమర్పిస్తున్నారు. అలాగే ఇతర ప్రాంతాల వారి చిరునామాలను, ఆధార్ కార్డులను మార్ఫింగ్ చేసి ఫారం-6 పేరిట దరఖాస్తులు చేయిస్తున్నారు. ఎన్నికల సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతూ అర్హుల ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారు.

దరఖాస్తుల వెల్లువ..

ఎన్నికల సంఘం ఏటా జనవరి 5వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేస్తుంది. అయితే ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో గత ఏడాది అక్టోబర్ 15వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసింది. మార్పులు, చేర్పుల తర్వాత జనవరి 22వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. అయినప్పటికీ నెల రోజుల వ్యవధిలోనే కొత్త ఓటరు నమోదుకు 7,236 ఫారం-6 దరఖాస్తులు అందాయి. అలాగే ఓట్లు తొలగింపునకు ఫారం-7 దరఖాస్తులు 3,011 అందాయి. రోజూ వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తుండటంతో వీటిలో అనేక కుట్ర కోణాలు ఉన్నట్లుగా పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఒత్తిడి పెంచి ఓట్ల తొలగింపునకు కుట్ర..

ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు చేయించడం వల్ల విచారణ చేపట్టే సమయం కూడా ఎన్నికల అధికారులకు ఉండదు. దీంతో గడువు సమీపించే వేళ మూకుమ్మడిగా దరఖాస్తులను అధికారులు ఆమోదిస్తారని, తద్వారా వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల ఓట్లను రద్దు చేయించవచ్చని టీడీపీ నాయకులు పెద్ద కుట్ర చేస్తున్నారు. ఇందుకు టీడీపీ కార్యకర్తలు, నాయకులు బోగస్ వ్యక్తుల పేరుతో దరఖాస్తులు చేయించడం, జైల్లో ఉన్న ఖైదీల పేరిట దరఖాస్తులు సమర్పించడం ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఇటీవల కాలంలో టీడీపీ నాయకులు ఎన్నికల సిబ్బందిపై కూడా ఫిర్యాదులు చేస్తూ హడావుడి చేస్తున్నారు. తద్వారా వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ కుట్రల ఫలితంగా వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, సాధారణ ప్రజలు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది.

ఆధార్‌కార్డు మార్ఫింగ్‌తో...

తమకు అనుకూలమైన వారికి ధర్మవరంలో ఓటు హక్కు కల్పించేందుకు టీడీపీ నేతలు ఆధార్ కార్డులను మార్ఫింగ్ చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల వారు, మండలాలకు చెందిన వారి వివరాలు సేకరించి.. వారు పట్టణంలో నివాసం ఉన్నట్లుగా ఆధార్‌కార్డులు మార్ఫింగ్‌లు చేసి ఫారం-6 దరఖాస్తులు చేస్తున్నారు. వీటిలో ఎక్కువ శాతం మంది అనర్హులు ఉన్నట్లుగా సమాచారం. అందువల్ల ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సదరు వ్యక్తులు స్థానికంగా ఉన్నారా..లేదా అని నిర్ధారించుకున్నాకే ఓటుహక్కు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటు తొలగించారు



నేను దశాబ్దకాలంగా మారుతీనగర్‌లో నివాసం ఉంటున్నా. నేను స్థానికంగా నివాసం లేనని ఎవరో ఫిర్యాదు చేయడంతో నా ఓటు తొలగించారు. దీంతో నా నివాస ధ్రువీకరణ పత్రాలు ఎన్నికల అధికారులకు సమర్పించి మళ్లీ దరఖాస్తు చేసుకోగా, ఓటు నమోదు చేశారు. మేము వైఎస్సార్ సీపీ మద్దతుదారులమన్న కారణంతో కొంతమంది తప్పుడు ఫిర్యాదులు చేసి ఓటు తొలగించారు.

– నారాయణమ్మ, మారుతీనగర్, ధర్మవరం.

ఓటు తొలగించాలని కుట్ర చేశారు



మేము ఆరేళ్లుగా బత్తలపల్లిలో నివాసం ఉంటున్నాం. ప్రతి ఎన్నికలోనూ ఓటు వేస్తున్నాం. అయితే కొంతమంది మేము స్థానికంగా లేమని, మా ఓట్లు తొలగించాలని తప్పుడు ఫిర్యాదు చేశారు. మేము సరైన ఆధారాలు అధికారులకు చూపి మా ఓట్లు రద్దు కాకుండా కాపాడుకున్నాం. అధికారులు కూడా అభ్యంతరాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– సంద్ర శ్రీలక్ష్మి, బత్తలపల్లి మండలం

చర్యలు తీసుకుంటాం

ఫారం-6, ఫారం-7 దరఖాస్తుల విషయంలో బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆధారాలు పూర్తిస్థాయిలో పరిశీలించి, విచారణ జరిపిన తర్వాతే ఆమోదిస్తున్నాం. బోగస్ దరఖాస్తులు, నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తులు చేస్తున్న వారి విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– వెంకట శివరామిరెడ్డి, ఆర్డీఓ, ధర్మవరం

పెరగనున్న భగభగలు

బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 37–38 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 20.5–22.6 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కావొచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 58–65 శాతం, మధ్యాహ్నం 23–27 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

'స్విఫ్ట్ చాట్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

పుట్టపర్తి: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తమ సెల్ ఫోన్లలో 'స్విఫ్ట్ చాట్' యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ మీనాక్షి మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. యాప్‌ను డౌన్ చేసుకోవటం వల్ల సందేహాలు నివృత్తి చేసుకునేందుకు వీలవుతుందని డీఈఓ పేర్కొన్నారు.

పేదింటి పెళ్లికి జగనన్న సాయం

- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా నిధులు విడుదల
- 416 జంటలకు రూ.3.10 కోట్ల లబ్ధి
- మెగా చెక్కు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు



మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: అమ్మాయి పెళ్లి నిరుపేద కుటుంబాలకు భారం కాకుండా జగన్ సర్కార్ ఆర్థిక సాయం అందిస్తోంది. అలాగే కులాంతర వివాహం చేసుకున్న జంటలకూ ఆర్థికంగా అండగా నిలుస్తోంది. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాల కింద ప్రతి త్రైమాసికంలోనూ నిధులు విడుదల చేస్తోంది. గత ఏడాది అక్టోబర్ –డిసెంబర్ త్రైమాసికంలో వివాహాలు చేసుకున్న 416 జంటలకు రూ.3.10 కోట్ల ఆర్థిక సాయం మంజూరు చేసింది. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్యాణమస్తు, షాదీతోఫా నిధులను విడుదల చేయగా, కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.

పది ఉత్తీర్ణత సాధిస్తేనే...

పదో తరగతి ఉత్తీర్ణత సాధిస్తేనే వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలు వర్తిస్తాయని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ప్రభుత్వం విధించిన ఈ నిబంధనతో బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడిందని, చదువుకునే యువతుల సంఖ్య మరింత పెరుగుతోందన్నారు. ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయాన్ని నూతన జంటలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా వాసులకు రూ.3.10 కోట్ల లబ్ధి..

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలతో జిల్లాలోని 416 జంటలకు రూ.310 కోట్ల లబ్ధి కలిగింది.

- ఎస్సీ కేటగిరీలో 82 మందికి రూ.లక్ష చొప్పున రూ.82 లక్షలు, కులాంతర వివాహం చేసుకున్న ఐదుగురికి రూ.1.20 లక్షల చొప్పు రూ.6 లక్షలు లబ్ధి కలిగింది.
- ఎస్టీ కేటగిరీలో 30 మందికి రూ.లక్ష చొప్పున రూ.30 లక్షలు, కులాంతర వివాహం చేసుకున్న ముగ్గురికి రూ.36 లక్షలు ఖాతాల్లో జమ చేశారు.
- బీసీ కేటగిరీలో 226 మందికి రూ.50 వేల చొప్పున రూ.1.19 కోట్లు, కులాంతర వివాహం చేసుకున్న ఏడుగురికి రూ.5.25 లక్షలు జమ చేశారు.
- మైనార్టీ కేటగిరీలో 46 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున రూ.46 లక్షలు అందించారు.
- దివ్యాంగుల కేటగిరీలో నలుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల చొప్పున రూ.6 లక్షలు, బీసీ(సీ) కేటగిరీలో ఒకరికి రూ.50 వేలు, ఓసీ కేటగిరీలో 12 మందికి రూ.12 లక్షలు అందించారు.

ఆడపిల్లలకు వరం



సీఎం వైఎస్ జగన్ పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్నారు. కల్యాణమస్తు పథకం మాలాంటి పేదలకు వరంగా మారింది. మాది కులాంతర వివాహం. సచివాలయంలో దరఖాస్తు చేయగానే.. అర్హత ఆధారంగా కల్యాణమస్తు మంజూరు చేశారు. పథకం కింద మాకు రూ.1.20 లక్షలు అందింది. అలాగే జగనన్న అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు ద్వారా మా కుటుంబం లబ్ధి పొందుతోంది.

– మమత, రమణ దంపతులు, పెదపల్లి, పుట్టపర్తి మండలం

జగనన్న రుణం తీర్చుకోలేనిది



నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు షాదీతోఫా ద్వారా ఆర్థిక సహాయం చేయడం చాలా సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. పేద పిల్లలను చదివించి పెళ్లి చేసి పంపడం రాష్ట్రంలో ఏ తండ్రికీ బరువు కాకుండా ఆ బాధ్యతనూ సీఎం జగనన్నే తీసుకున్నారు. నిజంగా ఆయన రుణం తీర్చుకోలేనిది. జగనన్నకు జీవితాంతం రుణ పడి ఉంటాం.

– రుబియా, సాదిక్‌వలి దంపతులు, బుక్కపట్నం

బాల్య వివాహాలకు అడ్డుకట్ట



వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలకు పదో తరగతి ఉత్తీర్ణత అర్హతగా పెట్టడం వల్ల చాలా మంచి జరుగుతోంది. బాల్య వివాహాలకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుంది. చదువు విలువ తెలిసిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండటం మనందరమూ చేసుకున్న అదృష్టం. పది కాలాల పాటు జగనన్నే మనకు ముఖ్యమంత్రిగా ఉండాలి.

– గౌతమిబాయి, ప్రవీణ్‌కుమార్ నాయక్ దంపతులు, కృష్ణాపురం

క్లుప్తంగా

సత్యసాయి సేవలను మరింత విస్తరించడమే లక్ష్యం



మొబైల్ ఆస్పత్రి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి వైద్య సేవలను మరింత విస్తరించడం ద్వారా వీలైనంత ఎక్కువ మంది అభాగ్యులకు సేవలు అందించడమే లక్ష్యంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పని చేస్తోందని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు పేర్కొన్నారు. తమిళనాడులోని కొయంబత్తూర్ కేంద్రంగా నూతనంగా ప్రారంభించిన సత్యసాయి మొబైల్ ఆస్పత్రి బస్‌కు మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు చేసి, మాట్లాడారు. గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ఏర్పాటు చేసిన మొబైల్ ఆస్పత్రులు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. ఈ క్రమంలో రాబోవు రోజుల్లో మరిన్ని రాష్ట్రాల్లో మొబైల్ ఆస్పత్రులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తమిళనాడు సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం అర్బన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆసక్తి చూపే పదో తరగతి విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పాలీసెట్)కు దరఖాస్తు చేసుకోవాలని ధర్మవరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర సాంకేతికశాఖ శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకూ దరఖాస్తుకు గడువు ఉందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులు, 2024, మార్చిలో పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్, హెల్ప్‌లైన్ సెంటర్ల ద్వారా అందజేయాలన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

సరిహద్దు గ్రామాల్లో విస్తృత తనిఖీలు





ఆదెపల్లిలో తనిఖీలు చేస్తున్న ఇరు రాష్ట్రాల అధికారులు, కొడికొండ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

హిందూపురం అర్బన్: ఎన్నికలు సమీపిస్తుండడంతో సరిహద్దు గ్రామాల్లో ఆంధ్ర, కర్ణాటక పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. కర్ణాటకలోని చిక్కబళ్లాపురం ఎక్సైజ్ డీఎస్పీ ఆర్.సురేష్, బాగేపల్లి సీఐ అనిల్‌కుమార్, హిందూపురం ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ గౌడ్, లేపాక్షి ఎస్‌ఐ గోపి తదితరుల నేతృత్వంలో మొత్తం ఐదు బృందాలుగా విడిపోయి చిలమత్తూరు మండలం ఆదెపల్లి, దిగువపల్లి తండా, గోరంట్ల మండలంలోని అటవీ ప్రాంత గ్రామాల్లో తనిఖీలు కొనసాగించారు. నాటుసారా తయారీ, విక్రయాలు, మద్యం అక్రమ తరలింపులు, అమ్మకాలు చేసినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర సరిహద్దు కొడికొండ చెక్‌పోస్టులో పోలీసు, సెబ్, రవాణా, అటవీ, సేల్స్ ట్యాక్స్ అధికారులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వదిలారు.

24న చెన్నకేశవ స్వామి ఉత్సవాలు





కొండలో కొలువైన చంద్రాయుని స్వామి మూలవిరాట్, వాహనాల పార్కింగ్ కోసం భూమిని చదును చేసిన దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి కొండల్లో వెలసిన చెన్నకేశవస్వామి ఉత్సవాలు ఈ నెల 24న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా ఈ ఆలయానికి పేరుంది. శతాబ్దాల క్రితమే ఇక్కడ వెలసిన స్వామిని భక్తులు మల్లో చెన్నుడని, జెన్నావల్లప్ప రకరకాల పేర్లతో కొలుస్తుంటారు. ఏటా మాఘ మాసంలో తరుగు వాండ్లపల్లికి చెందిన తరుగు వంశీయులు తడకోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈ నెల 24న తడకోత్సవాన్ని నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచే కాక కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో కొండ మీదకు వాహనాల రాకపోకలకు ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేశారు.

ఆన్‌లైన్ మాయగాళ్లు

- పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో టోకరా
- యువతే లక్ష్యంగా గాలం



హిందూపురం అర్బన్: అక్షర జ్ఞానం లేని వారు మొదలు ఉన్నత విద్యావంతులూ ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారు. ఖాళీ సమయంలో ఇంటి నుంచే పార్ట్ టైం ఉద్యోగమంటూ నమ్మించి మోసాలకు పాల్పడుతున్న కేటుగాళ్ల వలలో చిక్కుకుని యువత విలవిల్లాడుతోంది. ఇలాంటి కేసులు ఇటీవల హిందూపురం పట్టణంలో ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. హిందూపురం పరిసరాల్లో ఇప్పటికే 300 మంది వరకు యువత ఈ తరహా మోసాలకు గురైనట్లుగా తెలుస్తోంది. ఆన్‌లైన్ మోసాలపై పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నా కేటుగాళ్ల ఉచ్చులో యువత చిక్కుకుంటూనే ఉంది. ఇందులో కొన్ని పోలీసుల దృష్టికి వస్తుండగా... కేసులు నమోదు కాని మోసాలు భారీగా ఉన్నట్లు సమాచారం.

మచ్చుకు కొన్ని...

- చిలమత్తూరుకు షబనమ్‌తాజ్ డిగ్రీ వరకూ చదువుకుంది. ఇటీవల ఆమె మొబైల్‌కు ఫోన్ చేసిన వ్యక్తి ఇంటి వద్దనే ఖాళీ సమయంలో పార్ట్‌టైం ఉద్యోగం చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చునని నమ్మించాడు. మీతో పాటు మరింత మందిని చేర్పించగలిగితే ఆదాయం రెట్టింపు అవుతుందని తెలిపాడు. అవతలి వ్యక్తి మాటలు నమ్మిన ఆమె హిందూపురంలోని చిన్న మార్కెట్ వద్ద పైఅంతస్తులో ఉన్న ఊరూపేరులోని కంపెనీలో చేరేందుకు సిద్ధమైంది. తొలుత టెలీ ఆపరేటర్‌గా పనిచేయాల్సి ఉంటుందని, డిపాజిట్ ఇతరత్రా కలుపుకుని రూ.10 వేలు చెల్లిస్తే నెలకు రూ.13 వేల వరకూ జీతం అందుతుందని తెలిపారు. దీంతో ఆమె తన వద్ద ఉన్న రూ.9 వేలు చెల్లించింది. నెల రోజుల తర్వాత రూ.3వేలు చేతిలో పెట్టారు. మరి కొంత మందిని కంపెనీలో చేర్చాలని ఒత్తిడి పెంచారు. మూడు నెలలు గడిచినా ఫలితం లేకపోయింది. పనిచేసిన దినాలకు జీతం చెల్లించాలని అడిగితే పనితీరు బాగోలేదని రూ.1,500 చేతిలో పెట్టి పంపారు. దీంతో చేసేది లేక ఆ ఉద్యోగం వదిలేసింది. ఇలాంటి వారు వందల్లో ఉన్నారు.
- బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి నుంచి హిందూపురంలోని ముక్కిడి పేటకు చెందిన రహమాన్‌బాషాకు ఫోన్ వచ్చింది. ఇంట్లో నుంచే పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ ఎక్కువ సంపాదించ వచ్చని అవతలి వ్యక్తి నమ్మబలికాడు. యూట్యూబ్‌లో వీడియోలకు లైక్ చేస్తే చాలన్నారు. చాలా సులువైన పనిగా భావించిన రహమాన్ బాషా వెంటనే వారు అడిగినట్లుగా తన బ్యాంక్ వివరాలు అందజేశాడు. మొదట 5 వీడియోలు లైక్ చేసినందుకు రూ.150 వంతున రూ.750 అతని ఖాతాలో జమ అయింది. ఇలానే చేస్తే మంచి ఆదాయం ఉంటుందన్నారు. కంపెనీకి కొంత మొత్తం డిపాజిట్ చెల్లిస్తే టీమ్‌లో తీసుకుంటామని తెలిపి రూ.25 వేలు లాగేసుకున్నారు. ఇందులో నుంచి రూ.17 వేలను 15 రోజుల తర్వాత అతని ఖాతాలో వేశారు. నమ్మకం పెరగడంతో రూ.50వేలు డిపాజిట్ చేయించుకుని ఖాతా కట్టేశారు.

ప్రకటనలు నమ్మి మోసపోవద్దు



కస్టమర్ కేర్ నంబర్లతో జాగ్రత్తగా ఉండాలి. బ్యాంక్ అకౌంట్, ఆధార్ నంబర్‌లను అజ్ఞాత వ్యక్తులకు అందజేయరాదు. ముఖ్యంగా పేరు, చిరునామా, ఈ మెయిల్ ఐడీ, ఓటీపీలు, అకౌంట్ నంబర్లు, డెబిట్ కార్డుల వివరాలు ఎవరికీ తెలపరాదు. పార్ట్‌టైం, ఆన్‌లైన్ ఉద్యోగమని చెప్పే వారితో ఫోన్‌లో మాట్లాడం కంటే ముఖాముఖి కలవడమే మంచింది. ఉద్యోగం కోసం డిపాజిట్ చెల్లించాల్సి వస్తే కంపెనీ గురించి పూర్తి స్థాయిలో తెలుసుకోవాలి.

– కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం

ఎస్కేయూకు రూ.20 కోట్ల నిధులు మంజూరు



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న ఎస్కేయూ విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి

అనంతపురం: పీఎం– ఉష పథకంలో భాగంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి రూ.20 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. మంగళవారం ఈ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా సెంట్రల్, స్టేట్ వర్సిటీల విద్యార్థులనుద్దేశించి వర్చువల్ విధానంలో మోదీ ప్రసంగించారు. అనంతపురంలోని ఎస్కేయూ నుంచి వీసీ డాక్టర్ కె.హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులనుద్దేశించి ఎస్కేయూ వీసీ డాక్టర్ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య మాట్లాడుతూ... పీఎం ఉషా పథకం కింద మంజూరైన నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో పీఎం ఉష ప్రోగ్రాం ఎస్కేయూ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ నాగరాజు, ప్రొఫెసర్ వి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోగో తయారీ పోటీల్లో పేరూరు విద్యార్థికి మూడో స్థానం



రాజమండ్రిలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నవదీప్

రామగిరి: మండలంలోని పేరూరు డ్యాంలో ఉన్న ఏపీఆర్ఎస్ (గురుకుల) బాలుర పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నవదీప్ మంగళవారం రాజమండ్రిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే క్రమంలో చిక్కీని సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిక్కీ తయారీని ట్రూగుడ్ సంస్థ దక్కించుకోగా లోగో చిత్రీకరణ కోసం ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోని విద్యార్థులకు సంస్థ పోటీ నిర్వహించింది. ఈ పోటీల్లో పేరూరు డ్యాంలోని ఏపీఆర్ఎస్ విద్యార్థి నవదీప్ పాల్గొని, రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతిని దక్కించుకున్నాడు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు మంగళవారం రాజమండ్రి వేదికగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను మంత్రి చెల్లుబోయిన చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంజేపీ రాష్ట్ర పాఠశాలల సెక్రెటరీ కృష్ణమోహన్, పేరూరు ఏపీఆర్ఎస్ ఉపాధ్యాయుడు శ్రీరాములు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో యజ్ఞం ఆరంభం



యాగంలో పాల్గొన్న భక్తులు


పుట్టపర్తి రూరల్: స్థానిక ఎనుములపల్లిలో వెలసిన హరిహర క్షేత్రం ఆలయ ప్రారంభ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయం ప్రారంభోత్సవంలో భాగంగా మూడు రోజుల పాటు జరిగే యజ్ఞం మంగళవారం ప్రారంభమైంది. ఉదయం మొదలుకుని సాయంత్రం వరకూ విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. సాయంత్రం 5 గంటలకు సిద్ధం చేసిన హోమగుండాలలో వేదపండితులు సహజ సిద్ధంగా నిప్పురవ్వను పుట్టించి హోమగుండాలు వెలిగించారు. శాస్త్రోక్తంగా యజ్ఞక్రతువు సాగింది. ఆలయ ధర్మకర్త శ్రీరాములు దంపతులతో పాటు ఆరు జంటలు, నాలుగు హోమగుండాల వద్ద యజ్ఞంలో పాల్గొన్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ఆశీనులు గావించి కల్యాణోత్సవాన్ని జరిపించారు. దేశవిదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శేష వాహనంపై విహరించిన శ్రీవారు



గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం రాత్రి దేవేరులతో కలసి శేష వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడి ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై అధిష్టింపజేసి పురవీధుల మీదుగా గ్రామ శివారులోని జమ్మి చెట్టు వద్దకు చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం తిరిగి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. బుధవారం హనుమద్ వాహనోత్సవం ఉంటుందని ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు.

చెరకు తోట దగ్ధం



బొమ్మనహాళ్: ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో చెరకు తోట దగ్ధమైంది. వివరాలు.. బొమ్మనహాళ్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన రైతు మచ్చన్న ఆరు ఎకరాల్లో చెరకు పంట సాగు చేశారు. 2 ఎకరాల్లో చెరకు పంట గానుగ పూర్తయింది. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో నాలుగు ఎకరాల్లోని చెరకు తోటలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికుల సాయంతో మంటలు ఆర్పేందుకు మచ్చన్న, కుటుంబసభ్యులు విశ్వ ప్రయత్నం చేశారు. అయినా ఫలితం దక్కలేదు. ఘటనతో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించి, నివేదిక సిద్ధం చేశారు.

వివాహిత అదృశ్యం



శ్రావణి (ఫైల్)

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు గ్రామానికి చెందిన వివాహిత శ్రావణి కనిపించ లేదని తండ్రి శ్రీరంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి శ్రావణి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిస్తే 9440901890 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ తెలిపారు.